# పెళ్ళైన ప్రతివాడికీ శివరంజని

వక్తి వెంకటరత్నం




ఆయన పేరు రంగారావు. పి. డబ్ల్యు. డిలో పనిచేసి, క్రిందటేడే రిటైరయ్యారు. రంగారావుగారు ప్రతీ రోజూ సాయంత్రం ఆరుగంటలకి మా యింటి ముందు నించి వాక్‌కి వెడుతూ వుండేవారు. ఒకరోజు ఆయన మా యింటి ముందుకి రాగానే వర్షం మొదలయింది. రంగారావుగారు తల దాచుకోడానికి మా యింట్లోకి వచ్చేరు. నేను ఆయన్ని లోపలికి ఆహ్వానించేను. నా భార్య, రాధ, వేడి కాఫీ తెచ్చి యిచ్చింది. రంగారావుగారు ఏదో ఖబుర్లు చెపుతూనే వున్నారు.

'నువ్వు శాస్త్రీయ సంగీతం ఏప్పుడైనా కళ్ళు మూసుకుని విన్నావా రాజూ'? అని అడిగేరాయన ఉన్నట్టుండి.

అది విని రాధ చిలిపిగా చూసింది నా కేసి. 'పాట పాడవా బుజ్జిపాపా' అని నేను రాత్రి రాధని తరచు అడుగుతూంటాను. రాధ నామీద ఒరిగి కూర్చుని 'ఏం పాడనా?' అని ఆలోచిస్తూంటే 'పాడు మరి' అని ముద్దు పెట్టుకుంటూండే వాడిని. 'మీరా ముద్దులాపక పోతే నోట్లోంచి పాటెలా వస్తుంది స్వామీ' అనేది [illegible]

చేతులు వేసుకుని, మెడ నిఠారుగా పెట్టి: అలా రాధని చూస్తే మనసంతా గిలిగింతలు పెట్టినట్టుంటుంది. చెయ్యి చాచే వాడిని. రాధ నా చేతిలో చెయ్యేసి. దగ్గరకు వచ్చేది. నా తలని తన వళ్లో పెట్టుకుని, నా జుత్తుని తన వేళ్ళతో నిమురుతూ పాడేది తియ్యగా. నేను కళ్ళు మూసుకుని వినేవాడిని ఆమె పాటల్ని. ఎంత హాయిగ వుండేది అలా.

నా మొహం మీద చిరునవ్వు చూసి ఆయన ఏమకున్నారో. 'నువ్వు పాడలావా అమ్మా' అన్నారు రాధని చూసి.

'నన్నడగండి. ఆవిడ పాటలవల్ల పడే బాధంతా నాది' అన్నాను నవ్వుతూ.

'అందుకే కాబోలు అన్నమానూ పాడ మంటారు' అంది రాధ, తలవంచి కళ్ళు పైనించి నాకేసి కోపంగా చూస్తూ.

'నిన్ను ఎంకరేజ్ చెయ్యడానికోయ్ అది' అన్నాను నేను మళ్లీ నవ్వుతూ.

'ఒక పాట పాడమ్మా' అన్నారు రంగారావుగారు.

'ఆగండి, వీణ తీసుకొస్తాను' అని లోపలికెళ్లింది రాధ.

రంగరావుగారు నాకేసి చూసి అన్నారు 'అదృష్టవంతుడవోయ్' అని.

రాధ వీణతెచ్చి శృతిచేసింది. 'ఏం పాడ మంటారు' అంది రంగారావుగారికేసి చూసి.

'అక్కడికి అన్నీ వచ్చునట్టు! అహిర్ భైరవ్‌లో పాడు చూద్దాం' అన్నాను.

'మిమ్మల్ని ఎవరూ అడగలేదు' అంది రాధ చిరుకోపంతో.

రంగారావుగారు 'ఖరహరప్రియ రాగంలో పాడమ్మా' అన్నారు.

రాధ వీణ వాయిస్తూ 'పక్కల నిలబడి' పాడుతుంటే, నా మనసు పులకరించింది. 'మై లవ్లీ డార్లింగ్' అనుకున్నాను నాలో నేనే.

రాధ పాట ఆపుచేసి తల పైకెత్తింది. రంగారావుగారికేసిచూసి, ఆదుర్దాగా నాకేసి చూసింది. నేను అంతవరకూ రంగారావు గారిని చూడలేదు, నా చూపులు రాధమీదే నిలిచిపోయేయి. రాధ మొహంలో భావం చూసి, రంగరావుగారికేసి దృష్టితిప్పగానే, ఆశ్చర్యపోయాను. ఆయన కళ్లల్లోంచి కన్నీళ్ళు ధారగా వస్తున్నాయి. ఆయన ఈ లోకంలో వున్నట్టు కనబడలేదు.

# స ర్వే జ నా...

నేను రాధకి మౌనంగా వుండమని సంజ్ఞ చేసేను. కొద్ది క్షణాల్లో రంగారావుగారు సర్దుకుని, కూర్చున్నారు. కండువాతో కళ్ళు తుడుచుకున్నారు. ఆయన ముడతలుపడ్డ ముఖంలో నాకు విచారం లీలగా కనబడింది. హఠాత్తుగా ఆయన చిరునవ్వు నవ్వేరు.

'బాగా పాడేవమ్మా' అన్నారు తృప్తిగా.

'ఇంకోటి పాడనాండి' అంది రాధ వుత్సాహంగా.

'వద్దు' అన్నాను నేను చేతులు రెండూ ముఖంముందు పెట్టుకుని, వాటి వెనుక ముఖం దాచుకుని. రాధ లేచివచ్చి నా తల మీద మొట్టికాయవేసి మళ్లీ వెళ్లి కూర్చుంది వీణముందు.

ఆ రోజు రాధ నాలుగు పాటలు పాడింది.

బయట వర్షం. వెచ్చగా కాఫీ తాగి, రాధ అద్భుతమైన పాటలు వింటూంటే, 'ఇలాంటి బ్రతుకు పది రోజులున్నా చాలు, జీవితమంతా సఫలమైనట్టే' అనిపించింది. అలా హాయిగా అనిపించినప్పుడు, అదే నేను పైకి అంటే, రాధ 'మీకు పిచ్చి' అని నా తలని తన గుండెలమీద పెట్టుకుంటుంది. 'అదృష్టం నాది మీదికాదు' అనేది నా మెడమీద ముద్దుపెట్టుకుని. అలా అని పించినా, రంగారావుగారిముందు ముద్దు పెట్టుకోలేనుకదా, గాలిలోనే చేతితో చిన్న ముద్దు పంపేను. రాధ చిరునవ్వు నవ్వి 'థాంక్యూ' అన్నట్టు తల క్రిందకి వంచింది. రంగారావుగారు అదిచూసి పకపకా నవ్వేరు.

'రెండు మూడు రోజులకోసారి మా యింటికి వస్తే మీ కేం అభ్యంతరం లేదుగా' అన్నారు ఆయన మేం ఆహ్వానించే ముందే.

'రెండుమూడు రోజులకోసారి ఏమి టండీ, రోజూ రావాలి' అన్నాను నేను.

'వెడతాను' అన్నారు రంగారావుగారు.

నేను చిరునవ్వునవ్వి, తల పక్కకి వంచేను 'మీ యిష్టం' అన్నట్టు.

రంగారావుగారు అలా వెళ్ళగానే రాద అందుకుంది 'మీకు సిగ్గులేదు' అంది.

నేను నవ్వలేక చచ్చేను. 'నిన్ను పబ్లిగ్గా ముద్దు పెట్టుకుంటాను. ఎవరడుగుతారో రమ్మను. తంతాను వెధవల్ని' అన్నాను రాధని దగ్గరగా తీసుకుని, గడ్డంకింద చిన్న ముద్దిచ్చి.

ఇంతలో రంగరావుగారు హఠాత్తుగా లోపలికొచ్చేరు. 'సారీ, నా తాళాలు మర్చి పోయాను' అని టేబిల్ దగ్గరకొచ్చి తాళాలు తీసుకుని వెళ్లిపోయారు.

రాధ మొహం ఎర్రగా కందిపోయింది. 'తలుపులెయ్యాలని తెలియదూ' అంది.

'నాసి తమరు వెయ్యక పోయేరా?' అన్నాను.

* * *

రంగరావుగారు, ఆ తరువాత, తరచూ మా యింటికి వస్తూండేవారు. నేనూ అప్పుడప్పుడు వాళ్లింటికి వెడుతూ వుండే వాడిని.

రంగారావుగారు జీవితంలో పోగొట్టు కొన్నది చాలా విలువైనది — అది కన్న కొడుకు అభిమానం. ఎనిమిదేళ్ళ క్రితం, ఆయన ఒక్కగా నొక్క కొడుకు శంకరం, ఆయనతో దెబ్బలాడి యిల్లు వదిలి వెళ్లి పోయాడు. అప్పుడు శంకరానికి పద్దెనిమి దేళ్ళు. 'ఆరోజు వుద్రేకంలో, 'పోపోరా అడ్డగాడిద వెధవా' అన్నందుకు ఈరోజు వరకూ ఏడుస్తున్నాను రాజా' అనేవారు

## ఎండమ్మ

ఎండమ్మా నీసెగలు బహు మెండమ్మా,
ఎండమ్మా నీ పొగలు తెగమండమ్మా.
కాకినాడను కాల్చి పారేశావు.
విజయవాడను విధ్వంసం గావించావు.
వడదెబ్బకూడ్పులకు వందలాదిగ చచ్చారు.
వేడి గాడ్పులకు వేలాదిజనులు పీడారు ప్రాణాలు
చెట్లు చేమలు మాడిపొయ్యాయి
జంతుజాలాలు గల్లంతులయ్యాయి
కొండలు కోనలు మండిపొయ్యాయి
పూరి గుడిసెలకిక తావు లేదని
పేదవారికి మరో దిక్కు లేదని
నిప్పుకులోంగని పూరికప్పు లేదని.
ఎప్పుడు జాగ్రత్త అత్యవసరమని.
పొగలెత్తి చాటావు.
నిలువెత్తు మంటలతో ఎలుగెత్తి చెప్పావు.
సంఘ ద్రోహాలకు చనువిచ్చినావు.
సర్కారువారికి కనువిప్పినావు.
కట్టేస్తారు—మరికి పేటల బదులు
మురిపించే వాడలు.

— ఎల్. మాలకొండయ్య

ఆయన. ఆయన కొడుకు విశాఖపట్నంలో వుద్యోగం చేస్తున్నాడనీ, విడిపోయిన తర్వాత, ఇంతవరకూ తండ్రీ కొడుకులిద్దరూ మొహాలు చూసుకోలేదనీ చెప్పేరాయన.

ఒకసారి ఆయన అన్నది వింటే నాకా శ్చర్యం వేసింది. 'రాజా! నీతో వున్నప్పుడు హాయిగా వుంటుంది. కొడుకు దగ్గర లేదన్న బాధ తెలియదు' అన్నాడు.

'నేను కూడా ఇంకొళ్ళ బాధని మరి పించగలనన్నమాట, నాట్ బాడ్' అను కున్నాను, అప్పుడు; నాలో నేనే.

*  *  *

ఆరోజు, శనివారం, మొత్తం చాలా చిత్రమైన రోజు. నా మనసు ఆరోజు బాగా లేదు. ఆఫీసులో పనివల్ల అలసట, అనుకున్నట్టు ఒక్కపనీ జరగక పోవడం మూలాన్ని చీకాకుగా వుంది యింటి కొచ్చేటప్పటికి. కారు తలుపు దభేలుమని, మూసి లాక్ చేసేను ఇంటి దగ్గర. రాధ కిటికీలోంచి నన్ను చూస్తున్నదనుకుంటా. నేను పూలమొక్కల మధ్య నించి నడచి మెట్ల దగ్గరకు వస్తుంటే, వగరుగా గులాబీల వాసన ముక్కు దగ్గరకు చేరింది. విచ్చుకున్న పువ్వుల్ని అలా చూస్తుంటే, మామూలుగ అయితే 'హా' అనుకునే వాడిని. కాని, ఆరోజు ఏమీ అనిపించలేదు. తలుపు తెరిచి వుంచే యింట్లోకి అడుగు పెట్టేను. రాధ తలుపు వెనక నించి 'భౌ' అంది హఠాత్తుగా. నేనేం మాట్లాడ కుండా లోపలికి నడిచి సోఫా మీద కూల బడ్డాను.

'కాఫీ పడెయ్యవోయ్ నా మొహాన్ని' అన్నాను చిరాగ్గా.

రాధ మొహం చిన్నదయింది. మౌనంగా వెళ్ళి కాఫీ తెచ్చి నా ముందు పెట్టి, వెళ్ళబోయింది. రాధ చెయ్యి పట్టుకుని ఆపు చేసేను.

'నన్ను తిట్టవా' అన్నాను రాధ కళ్ళ లోకి చూస్తూ.

'ఎందుకు?' అంది రాధ.

'కోపం వచ్చిందా' అన్నాను. రాధ నా పక్కన కూర్చుని నుదుటి మీద వేళ్ళతో రాసింది.

'ఆ వచ్చింది' అంది సీరియస్‌గా. ఒక క్షణం ఆగి 'నామీద నాకు వచ్చింది కోపం' అంది.

నాకు ఆశ్చర్యం వేసింది, చిరాకుపోయి. 'ఎందుకు' అన్నాను.

'నా మూలాంచేకదా మీకు కోపం వచ్చింది' అంది రాధ.

'సిల్లీ! నువ్వేం చేస్తావు దానికి. ఇటు వైపు నించి చిరాకు రాకుండా చూసుకోవాలి నేను' అన్నాను.

'ఏం చిరాకు వస్తే తప్పా' అంది రాధ. నాకు సమాధానం దొరకలేదు. రాధ అన్నది రైటే — చిరాకు వస్తే తప్పా?

'చిరాకు రాకుండా వుంటే ఈ క్షణాలు కూడా హాయిగా వుండేవి కదా' అన్నాను సీలింగ్ కేసి చూస్తూ.

'జీవితంలో అన్ని క్షణాలూ ఆనందం తోనే వుంటే ఆనందం విలువేమిటి యింక' అంది రాధ.

'సినిమాకి వెడదామా' అన్నాను.

'గుడ్ ఐడియా; ఏం చూద్దాం' అంది రాధ.

న్యూస్‌పేపరు తీసి రెండో పేజీలో వెతికేం. 'ఓడియన్ వెడదాం' అన్నాను.

కాఫీ పూర్తి చేసి, బాత్‌రూమ్‌లోకి వెళ్ళేను స్నానంచెయ్యడానికి.

బాత్‌రూమ్‌నించి తిరిగివచ్చేసరికి రంగారావుగారు సోఫాలో కూర్చుని పేపరు తిర గేస్తున్నారు. నేను తువ్వాలుతో అలాగేవచ్చి 'నమస్కారం సార్! ఎంతసేపయింది వచ్చి' అన్నాను.

'ఇప్పుడేనోయ్! బట్టలేసుకురా, వెడదాం' అన్నారాయన.

'మీరు సినిమాకివస్తున్నారా' అన్నాను, రాధ అప్పుడే చెప్పివుంటుందని వూహించి.

'సినిమాకెడుతున్నారా? అయితే మళ్ళీ వస్తాలే' అని లేచేరు సోఫాలోంచి.

'మీరూ రాకూడదూ' అన్నాను.

'లేదు లేదు వెడతాను' అన్నారాయన.

'కూర్చోండి. మేం వెళ్ళేటప్పుడు మీ యింటిదగ్గర డ్రాప్‌చేసి వెడతాం' అన్నాను.

'లేదోయ్! కొద్దిగా నడిస్తే మంచిదే కదా యీ వయసులో' అన్నారాయన.


'మీ యిష్టం' అన్నాను నేను.

ఓడియన్‌కి డ్రైవ్‌చేస్తుంటే, మధ్య దారిలో అన్నాను రాధతో 'రాధా! రంగా రావుగారేదో ప్రత్యేకంగా చెప్పడానికి వచ్చే రనిపించడంలేదూ' అన్నాను.

'ఏమో' అంది రాధ ఆలోచిస్తూ.

సినిమా చూసి తిరిగివస్తుంటే, దారిలో రంగారావుగారింటి బయట, ఎవరో చేతులు కట్టుకుని నిలబడి, ఎదురుగావున్న దీప స్తంభంకేసి ఏదేకంగా చూస్తుంటే 'ఎవరా' అనుకున్నాను. కాస్త దగ్గరకొచ్చేక, రంగా రావుగారేనని గుర్తించి, ఆశ్చర్యపోయేను. ఏదో వింతగా అనిపించింది నాకు.

'రాధా చూసేవా ఆయన్ని' అన్నాను.



'మూసేను' అంది రాధ.
'ఆగుదామా' అన్నాను.
రాధేం మాట్లాడలేదు. నేను ఆయనదగ్గర ఆపుచేసి 'రంగారావుగారూ', అని పిలిచేను.
'అయిపోయిందా సినిమా' అన్నారు రంగారావుగారు.
'ఆఁ! అక్కడ నిలబడ్డారేమిటి? మా యింటికివస్తారేమిటి' అన్నాను.
'ఇంత రాత్రి ఎందుకు లేవోయ్' అన్నారాయన.
'రేపు ఆదివారమేకదండీ, సెలవురోజు



ఇవ్వాళ ఆలస్యంగా నిద్రపోయినా ఫరవా లేదు. రండి' అని పిలిచేను.

రంగారావుగారు ఇంట్లోకెళ్ళేరు. చెప్పే రనుకుంటాను 'బయటికి వెడుతున్నా'నని. ఆయన వచ్చి కారు వెనకసీట్లో కూర్చున్నారు. మా యింటికి చేరేలోగా రెండు సార్లన్నారాయన 'మరీ జోరుగా నడుపుతున్నావోయ్! వేగం తగ్గించు' అని.

'జోరుగా డ్రైవ్‌చేస్తే ఏంటండీ? ఏక్సిడెంటవుతుంది అంతేగా! ఏక్సిడెంటయి ఏమవుతుంది? చచ్చిపోతాం అంతేగా. జరిగేది జరక్కమానుతుందా?' అన్నాను.

'ఛీ! ఏమిటామాటలు' అంది రాధ నా చేతిమీద చెయ్యివేసి.

రంగారావుగారు ఏమీ మాట్లాడలేదు.

మా యింట్లో మేం భోజనంచేస్తుంటే రంగారావుగారు సోఫామీద కూర్చుని కబుర్లు చెబుతూవున్నారు.

భోజనంచేసి రంగారావుగారికి ఎదురుగా కూర్చున్నాను. రాధ ఏపిల్‌ముక్కలు తెచ్చి మా మధ్య టేబిల్‌మీద పెట్టింది. నేను నా ప్రక్కచోటు చూపించేను రాధని కూర్చోమని.

రంగారావు అన్నారు 'రాజా! జీవితం చాలా విచిత్రమయినదోయ్' అని.

నేను సాలోచనగా చూసాను ఆయనకేసి ఇందాకానేననుకున్నది రూఢి అయినట్లనిపించింది. రంగారావుగారు ఏదో చెప్పాలనుకుంటున్నారనిపించింది.

ఆరోజు రాత్రి పన్నెండున్నరవరకూ

# సర్వేజనా...

రంగారావుగారితో మాట్లాడుతూ కూర్చున్నాను. రాధ పదిన్నరకే నిద్రవస్తోందని వెళ్ళిపడుక్కుంది. రంగారావుగారి కొడుకు విశాఖపట్నంలో పెళ్ళిచేసుకోబోతున్నట్లు తెలిసిన వాళ్ళెవరో విశాఖపట్నంనించి వార్త తెచ్చేరు రంగారావుగారి దగ్గరకి.

'వాడెవర్ని పెళ్ళిచేసుకున్నా నా కభ్యంతరంలేదు కాని, కన్నతండ్రిని, వాడి పెళ్ళి నా చేతులమీదుగా చెయ్యాలని వుండదా రాజా' అన్నారు ఆయన.

రంగారావుగారు వెళ్ళిపోతూ అడిగేరు 'రేపు మా యింటికి రా, రాధని తీసుకుని' అని.

రంగారావుగారిని పంపించి తలుపులేసి బెడ్‌రూమ్‌లోకి వచ్చేటప్పటికి రాధ చిన్నపిల్లలా తలగడా కౌగలించుకుని పడుక్కుంది. రాధ బుగ్గమీద చిన్న ముద్దిచ్చి పడుక్కున్నాను.

ఆదివారం పొద్దున్న పదిన్నరకి రంగారావుగారింటికి వెళ్ళేం. గంటసేపు కూర్చుని వచ్చేసేం.

బయటికివచ్చి కారు స్టార్టుచెయ్యగానే 'అమ్మయ్యా! వదిలింది బోరు' అంది రాధ. నేను రాధ తలమీద చిన్నగా మొట్టికాయ వేసేను 'తప్పు! హి యీజ్ ఎ నైస్ మాన్' అన్నాను.

'అయితే వెళ్ళి యింకో పది గంటలు కూర్చోండి వాళ్ళింట్లో' అంది రాధ చిరాగ్గా.

'ఏమయింది?' అన్నాను నేనూ చిరాగ్గా.

'ఏమీ ఆవలేదు. పదండి' అంది రాధ.

ఇంట్లోకెళ్ళగానే రాధ 'మీకొకటి చెప్తే తాను ఏమీ అనుకోరుకదా' అంది.

'ఏమిటి? చెప్పు' అన్నాను, బెడ్‌రూమ్‌లోకి వెళ్ళబోతూ ఆగి.

రాధ నా చెయ్యిపట్టుకుని సోఫాదగ్గరికి తీసుకెళ్ళింది.

'మీరు మునపటంత యిదిగా వుండడం లేదు, ఎందుచేత?' అంది.

'ఇదిగా అంటే' అన్నాను.

'ప్రేమగ' అంది రాధ.

'నీ మొహం! అలా ఎందుకనుకున్నావు అసలు నువ్వు?' అన్నాను రాధ కళ్ళల్లోకి చూస్తూ.

రాధ హఠాత్తుగా ఏడుస్తూ నావళ్ళో వాలిపోయింది.

'ఏమయింది? పిచ్చీ! మీారు నేనంటే ఇష్టంలేదని చెప్పినా నమ్మను నేను' అంటావు ఎప్పుడూను, ఏమయింది నీకు హఠాత్తుగా?' అన్నాను.

'రంగారావుగారు కలిసి నప్పటినించీ మీరు నాగురించికూడా మర్చిపోయి ఎందుకు తిరుగుతున్నారు ఆయనతో' అంది.

నాకు మతిపోయినంత పనయింది. గట్టిగా నవ్వేను. 'సిల్లీగర్ల్! ఆయనతో తిరిగితే నిన్ను మర్చిపోయినట్టా? నువ్వెవరు, ఆయనెవరు నాకు? నిన్ను వదిలి ఆయన్ని పెళ్ళిచేసుకుంటాననుకున్నావా?' అన్నాను.

రాధ కన్నీళ్ళు తుడుచుకుని, నవ్వింది 'మీరలా గంటల తరబడి నన్ను వదిలి ఎలా తిరుగుతున్నారు? మీరు పది నిముషాలైనా లేకపోతే అదోలా వుంటుంది నాకు' అంది.

'నన్ను నీ చీరంగామార్చి, కట్టేసుకో ఎప్పుడూ నీతోనే వుంటాను' అన్నాను.


'ఇదే మీతో వచ్చింది. నాఫీలింగ్స్ అర్థం చేసుకోరేం? మీారు మీాజోకులూను'అంది.

'లేకపోతే ఏమిటి రాధా! యిలాంటి పిచ్చి ఫీలింగ్స్ రానివ్వకు, మంచిదికాదు' అన్నాను.

'మంచో చెడో నాకు తెలియదు. నాకనిపించినది చెప్పేను. తప్పా?' అంది.

'తప్పు! డామ్ మి ఇఫ్ ఐసేపో'అన్నాను.

'అయితే ఓ పదిహేను నిముషాలు నోరు మూసుకుని నేను చెప్పేది వినండి. తొంభై



సాయంత్రాలు మీరు రంగారావుగారితో కలిసి బలాదూరు తిరుగుతున్నప్పుడు ఒక్కసారైనా 'నేను వంటరిగా యిక్కడ ఎంత బోర్ అవుతున్నానో ఆలోచించేరా? (భాష వింటే నవ్వొచ్చింది నాకు) ఒకరోజు ఆఫీసు నించి తిన్నగా వెళ్ళి వాళ్ళింట్లో కూర్చోడం. నేను మీ కోసం వెయిట్ చేస్తున్నానని తెలియదా? మీకు నాకంటే ఆయనే ఎక్కువయ్యేరా? ఒకరోజు మీరు మధ్యాన్నం ఆఫీసునించి ఇంటికి భోజనానికి వచ్చినప్పుడు, నేను పక్కింట్లోవుంటే మీరెంత గొడవపెట్టేరు! 'నేను ఇంటికొచ్చే టైములో అలా ఎక్కడికీ వెళ్ళకు. చంపుతాను' అనలేదూ మీరు. నేనుమాత్రం అనుకోనా? నన్ను వంటరిగా వదిలి ఎప్పుడూ వెళ్ళద్దు మీరు' అంటూ, మళ్ళీ కన్నీళ్ళు పెట్టుకుంది రాధ.

రాధని గట్టిగా కౌగలించుకున్నాను 'అయామ్‌సారీ రాధా! నువ్విలా బాధపడతావని ఊహించలేదు. నిన్ను వంటరిగా వదిలి వెళ్ళడం నాకు మాత్రం సరదానా? రంగారావుగారి బాధ చెప్పేనుకదా! ఈ వయసులో ఆయనకి కాస్త మనశ్శాంతి ఇవ్వడంకోసం ఆయనతో స్నేహం పెంచుకున్నాను. నువ్విలా అనుకుంటే ఎలా? ఆయనని దూరంగా వుంచితే ఆయన బాధపడరా?' అన్నాను.

'సరే అయితే! ఆయనతోనే తిరగండి. నాకంటే ఆయన ఎక్కువకాదూ మీకు. ఆఖరికి పార్కులోకూడా మనతో ఆయన వుండాలి. వంటరిగా మనని వదిలిపెట్టాలని ఆయనకి తెలియనప్పుడు మిమ్మల్నేమనుకునేం లాభం' అంది రాధ.

రెండు నిముషాలు యిద్దరం ఏమీ మాట్లాడలేదు.

రాధ లేచి 'కాఫీ తాగుదామా' అంది.

'తీసుకురా' అన్నాను. రాధ కాఫీచేసి తెచ్చింది.

కాఫీ తాగుతుంటే నెమ్మదిగా అంది 'ఫ్రాంక్‌గా చెప్పండి. మీకు నేనంటే మునపటంత పిచ్చిలేదుకదూ. నేనంటే ప్రేమవుంటే, నేను తప్పు చెప్పినా సరే 'అవును' నేవారు' అంది.

నాకు హఠాత్తుగా కోపం వచ్చింది 'కమాన్ రాధా! బీసెన్సిబిల్' అన్నాను.

రాధ కళ్ళలో మళ్ళీ నీళ్ళువచ్చేయి. నాకేంచెయ్యాలో అర్థంకాలేదు.

'ఇటుపైనించి రంగారావుగారితో తిరగడం తగ్గించాలి' అనుకున్నాను.

రెండురోజుల తరువాత రంగారావుగారే వచ్చి చెప్పేరు; వాళ్ళ అబ్బాయి దగ్గర్నుంచి వుత్తరం వచ్చిందనీ. విశాఖపట్నం వెళ్ళి అతన్ని కలుసుకుంటున్నాననీ.....!!

సర్వేజనా సుఖినోభవంతు!!!

# స్కిజోఫ్రీనియా

## —పి. రమేష్ నారాయణ.

మానవ సమాజంలోని వ్యక్తుల్లో కనబడే విచిత్రమయిన మానసిక స్థితిని స్కిజోఫ్రీనియా అనవచ్చు. విరుద్ధ మనస్తత్వం వ్యక్తపరచే ఈ వ్యాధిగల వారికి మంచి ఉదాహరణ డాక్టర్ జకిల్—మిస్టర్ హైడ్. నిజానికిది ఒకే వ్యాధికాదు. ఎన్నో కారణాలవల్ల వ్యక్తుల ప్రవర్తనలో భిన్నంగా కనబడే విపరీతపు లక్షణాలు ఈ వ్యాధిరూపంలో గోచరిస్తాయి. దీన్ని గుర్తించటానికి సరయిన 'డయాగ్నసిస్' అంటూ ఏదీ లేదు. మూత్రము, రక్తము, ఎక్స్‌రే పరీక్షల్లాంటివి సరిగ పనిచేయవు. కాని కొన్ని రకాల మనస్తత్వ పరీక్షలవల్ల ఈ రోగులను కొంతవరకు స్థిరీకరించవచ్చు. అంతేగాక ఈ రోగాల్లో 20 శాతం మందికి పూర్తి నివారణ గమనించబడితే, కనీసం 35 శాతమయినా ఈ వ్యాధికి బలిగాక తప్పదని తేలింది.

స్కిజోఫ్రీనియా వ్యాధిపై నేటివరకు కొనసాగిన పరిశీలనలాధారంగ తేలిన విషయాలని ఇలా చెప్పవచ్చు. ఈ వ్యాధికి గురయిన వ్యక్తులు సాధారణంగా కలత ఎక్కువగ వుండే కుటుంబాల్లో వుండే అవకాశాలు హెచ్చుగ వున్నాయి. అంతేగాక కుటుంబంలో చీటికి మాటికీ సంభవించే కలతలవల్ల వారి సంతానంలో మానసిక అశాంతి, నిరుత్సాహము ఏర్పడి కుటుంబ సభ్యుల మధ్య వుండాల్సిన సామరస్యం లోపిస్తుంది.

మరో ముఖ్యవిషయం ఏమంటే ఈ రోగుల తలిదండ్రుల్లో తప్పక తల్లి బలీయమయిన, తన మాటే నెగ్గుకొని వచ్చే తత్వాన్ని కలిగి వుంటుంది. అలాంటపుడు తండ్రి తన భార్య మాటకే విలువెక్కువగా ఇస్తుంటాడు. ఇలాంటివారి సంతానంలో వ్యక్తిత్వం లోపించే అవకాశాలు హెచ్చుగ వున్నాయి. ఒకవేళ వ్యక్తిత్వాన్నంటూ బిడ్డలు నిలుపుకోదలచినా దానివల్ల కుటుంబంలో వచ్చే కొన్ని పర్యవసానాలు ఇష్టపడక త్యజించుకోవలసి వస్తుంది. ఇలాంటి స్థితిలో వున్న యువకులయితే, నిరాశ, నిస్పృహలతో కూడిన అశాంతికరమైన జీవితం గడుపుతుంటారు. సున్నిత మనస్తత్వాలు గల యువతులు కూడా సులభంగానే గురవుతారు. ఇలాంటి పరిస్థితులు వ్యక్తుల్లో 'సింపుల్ స్కిజోఫ్రీనియా'కు దారితీస్తాయి.

స్కిజోఫ్రీనియా రోగులకు సరయిన వైద్య సదుపాయాలుండాలి. వీరు వైద్యశాలల్లో చేర్చబడినపుడు సైకియాట్రిక్ వార్డులో ప్రత్యేక సంరక్షణ పొందాల్సి వుంటుంది. ఈ రోగులు ఆత్మహత్యా ప్రయత్నాల్లాంటివి కొనసాగించకుండా తగు రక్షణ చర్యలు తీసికోవాలి. క్లోర్‌ప్రమజిన్ లాంటి రసాయనాల వాడకము, ఎలెక్ట్రిక్‌షాక్ ట్రీట్‌మెంటు నిచ్చటము కొంతవరకు ఈ రోగులకు మానసిక శాంతి నిస్తాయని వైద్య పరీక్షల్లో తేలింది.

ఈ అంశానికి సంబంధించిన మరో ముఖ్య విషయం— ఈ వ్యాధి జన్యు సంబంధమైనదని. అంటే వంశపారంపర్యంగా కూడా కొందరిలో వచ్చే అవకాశాలున్నాయనొచ్చు. కానీ వ్యక్తుల పరిసరాలు, వివేకము, శరీరతత్వము కూడా కొంతవరకు దీన్ని వ్యక్తం చేయవచ్చునని నవీన పరిశోధనలు తెల్పుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ 450వ టెక్నికల్ రిపోర్టు ఆధారంగా మన కేంద్రనాడీమండలంలోగాని, రక్తంలోగాని వుండే ఒక విపరీతపు అమైన్ లేదా ప్రోటీను అంశం ఈ రోగానికి ముఖ్య కారణమని తేలింది.

ప్రస్తుతం సైకియాట్రీ, క్లినికల్ పాథాలజీ, బయోకెమిస్ట్రీ, న్యూరోమెడిసిన్ విభాగాల్లో ఇంగ్లండు, అమెరికాల్లో ప్రముఖంగా కొనసాగుతున్న వైద్యశాస్త్ర పరిశోధనలు ఈ అంశంపై గల సిద్ధాంతాలను, వైద్యవిధానాలను రోగ నివారణ విషయంలో సత్ఫలితాలు నిచ్చే రీతిగ రూపొందుతున్నాయనవచ్చు.